

తెలంగాణభవన్‌లో గురువారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, పార్టీ నాయకులు కొప్పుల ఈశ్వర్, రవీంద్రనాయక్ తదితరులు

గిరిజన జాతికి మార్గం చూపిన సేవాలాల్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనులకు న్యాయం: సత్యవతి
- తెలంగాణ భవన్‌లో ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆ జాతికి మార్గంచూపిన మహనీయుడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కొనియాడారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయమైన తెలంగాణభవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి విశేషంగా కృషి చేసిందని తెలిపారు. ఆయన చేసిన సేవలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన భోగ్‌బండార్ కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు సరైన న్యాయం జరిగిందని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు. ఆనాడే నాలుగు లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు దక్కాయని చెప్పారు. గిరిజన గూడాలు, తండాలు పంచాయతీలు అయ్యాయని, రిజర్వేషన్లు దక్కాయని, గిరిజన ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకంతో పెండ్లిలకు ఆర్థికసాయం అందిందని వివరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, గిరిజన నాయకులు వాల్యా నాయక్, రాంబాల్ నాయక్, రూప్ సింగ్, కరాటే రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజన మహళలు గిరిజన సంప్రదాయ నృత్యం చేశారు. మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవితలు కూడా వారితో కల్సి నృత్యం చేశారు.

ఉద్యోగాల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. రిజర్వేషన్ల విధానంపై కోర్టు కేసులు, వివాదాల నేపథ్యంలో ఉద్యోగాల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమశాఖ సెక్రటరీ వాకాటి కరుణ ఇటీవల జీవో ఇచ్చారు. దీంతో మహిళలకు కేటాయించే 33 శాతం రిజర్వేషన్లు హరిజాంటల్ విధానంలోనే ఉండనున్నాయి.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం పెట్టాలి

- ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఎంబీసీ సంఘాల జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చాకలి ఐలమ్మ ఉద్యమస్ఫూర్తిని 5వ తరగతి పాఠ్యాంశాల్లో చేర్చిందని, అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించిందని తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు సీఎం చొరవ చూపాలని ఆయన కోరారు.

రాజ్యసభకు ముగ్గురు ఏకగ్రీవం!

- నామినేషన్లకు ముగిసిన గడువు
- రవిచంద్ర, రేణుక, అనిల్ ఎన్నిక ఇక లాంఛనమే



గురువారం బీఆర్ఎస్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్, వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఖాళీ అయిన మూడు స్థానాలకు నామినేషన్లు వేసే గడువు గురువారంతో ముగిసింది. అధికార కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. మూడు స్థానాలకు ముగ్గురే నామినేషన్లు వేయడంతో వారి ఎన్నిక ఇక లాంఛనం కానున్నది. మరో ఇద్దరు అభ్యర్థులు కూడా నామినేషన్లు వేసినప్పటికీ నిబంధనల ప్రకారం వారిని ప్రతిపాదించే ఎమ్మెల్యేలు లేకపోవడంతో అవి చెల్లుబాటయ్యే అవకాశం లేదు. నామినేషన్ల పరిశీలన అనంతరం వాటిని తిరస్కరించనున్నారు. ఈ నెల 20న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసాక ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటించనున్నారు.

కాంగ్రెస్ నుంచి రేణుక, అనిల్‌కుమార్

అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు స్థానాలకు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ నామినేషన్లు దాఖలు చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాసు మున్షీ సమక్షంలో వారు తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి అందజేశారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరై అభ్యర్థులకు శుభాకాంక్షలు చెప్పారు.

బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు

బీఆర్ఎస్ పార్టీ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్ వేశారు. మొదట ఆయన తెలంగాణభవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి గన్‌పార్క్‌కు చేరుకున్నారు. అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన అనంతరం శాసన సభ ఆవరణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేశారు. వద్దిరాజు వెంట పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్ ఇతర నాయకులు ఉన్నారు. వీరందరితో పాటు వద్దిరాజు రవిచంద్రకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, మధుసూదనాచారి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, తాతా మధు, శేరి సుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, దండే విఠల్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు కొండా దేవయ్య, ఆకుల గాంధీ, ఎర్రా నాగేందర్ శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.

- పోచారానికి కేటీఆర్ పరామర్శ

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాలికి శస్త్రచికిత్స జరిగింది. గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో ఆయన్ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం రాత్రి పరామర్శించారు. చిత్రంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఉన్నారు. – బాన్సువాడ

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

- అసెంబ్లీలో ప్రస్తావించాలని కేటీఆర్‌కు వినతి



కేటీఆర్‌కు కరపత్రం అందజేస్తున్న డాక్టర్ జేరిపోతుల పరశురామ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని, ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గురువారం అసెంబ్లీ ఆవరణలో వినతిపత్రం అందజేశారు. 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు 'రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం' అనే అంశంపై పుస్తకాన్ని రాసి హిల్టన్ యంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్‌కు అంబేద్కర్ ఇచ్చారని, దాని ఫలితంగానే 1935 ఏప్రిల్ 1న ఆర్బీఐ ఏర్పడిందని గుర్తుచేశారు. అంబేద్కర్ లేకుంటే ఆర్బీఐనే లేదని పేర్కొన్నారు. తన వినతిపై కేటీఆర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెంజిమెన్, కాశీం, అనిల్, రవికుమార్ ఉన్నారు.

కృష్ణా జలాల నిర్వహణను కేఆర్ఎంబీకి ఎందుకివ్వరు?

- బీజేపీ సభ్యుడి ప్రశ్న.. సభలో లొల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కృష్ణాజలాల నిర్వహణను కేఆర్ఎంబీకి ఎందుకు అప్పగించడంలేదో చెప్పాలని బీజేపీ సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి కోరారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పునర్విభజన చట్టం వల్లనే నదీజలాల పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని అన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకుంటూ, రాష్ట్రం కోరిన విధంగా కృష్ణాజలాలను కేటాయిస్తే వెంటనే కేఆర్ఎంబీకి అప్పగిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ, ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఏడేండ్ల సమయం తీసుకున్నదని చెప్పారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ, అంతర్జాతీయ జలవివాదాల చట్టంతోపాటు నదీ పరివాహక ప్రాంతాల ప్రకారం కృష్ణాజలాల్లో తెలంగాణకు 68.5శాతం, ఏపీకి 31.5శాతం రావాల్సివుందని చెప్పారు. శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొంటూ.. ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, సభ్యులు ద్రవ్య వినిమయబిల్లుపైనే మాట్లాడాలని కోరారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

వర్గీకరణపై తీర్మానించాలి:మహేశ్వర్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేయాలని బీజేపీ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి కోరారు.

గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో పార్టీ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయికిరణ్, వాసుదేవరెడ్డి

రేపు ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- వెయ్యి మంది ఆటో డ్రైవర్లకు బీమా
- దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ
- సామాజిక కార్యక్రమాలు
- కేసీఆర్‌పై లఘుచిత్రం ప్రదర్శన
- మాజీ మంత్రి తలసాని, బీఆర్ఎస్ నేత సాయికిరణ్ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జాతిపిత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు వేడుకలను శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. తెలంగాణభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా కేసీఆర్ జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఉద్యమసారథి, రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రపథంలో నిలిపిన కేసీఆర్ 69 ఏండ్లు పూర్తిచేసుకొని 70వ ఏటలో అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించే ఈ వేడుకలు ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయని, రాజ్యసభ సభ్యుడు కేశవరావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పార్టీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొంటారని తెలిపారు. ఆలయాలు, మసీదులు, చర్చిలలో పూజలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 1,000 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.లక్ష విలువైన బీమా సదుపాయం, అందరికీ కలిపి రూ.10 కోట్ల విలువైన ప్రమాద, ఆరగ్య బీమా పత్రాలను అందజేస్తామని బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ తెలిపారు. వికలాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేస్తామని, దవాఖానల్లో రోగులకు పండ్ల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామని వివరించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన, సాధించుకున్న రాష్ట్రాన్ని ఎలా అగ్రగామిగా నిలిపాడన్న కేసీఆర్ ఘనతను వివరిస్తూ 'తానే ఒక చరిత్ర' పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీని ఈ వేడుకల సందర్భంగా ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రత్యేకంగా తయారు చేయించిన 70 కిలోల కేక్‌ను పార్టీ కార్యాలయంలోనే కట్ చేస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నేతలు ఆశీశ్ కుమార్‌యాదవ్, గోసుల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ద్రవ్యవినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ద్రవ్యవినిమయ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. బిల్లుపై గురువారం రాత్రి వరకు చర్చించిన అనంతరం సభ ఆమోదించింది. బిల్లుపై బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ సభ్యులు రాజ్‌ఠాకూర్ , ఎంఐఎం నేత అక్బరుద్దీన్, బీజేపీ సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తామని, ఆశ , అంగన్‌వాడి, మహిళా స్వయం సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఏఎన్ ఎంల వేతనాలు ప్రతి నెలా చెల్లించే విధంగా ప్రయత్నిస్తామని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి చెల్లిస్తున్న పన్నులు అత్యధికంగా ఉన్నా... రాష్ట్రాలకు మాత్రం అతి తక్కువగా నిధులు వస్తున్నాయని, దీనిపై కేంద్రం వద్దకు అఖిల పక్షాన్ని తీసుకవెళ్లేందుకు ప్రయత్నిస్తామని అన్నారు.

కరెంటు కోతలపై రోడ్డెక్కిన రైతు

- విడతలవారీ కరెంటుపై ఫైర్
- ఇచ్చే కరెంటు ఒక్కసారివ్వాలి
- నల్లగొండ జిల్లా త్రిపురారం రైతుల ఆందోళన
- కోదాడ-జడ్చర్ల హైవేపై ధర్నా
- విద్యుత్తు ఏఈ హామీతో రైతుల ఆందోళన విరమణ

త్రిపురారం, ఫిబ్రవరి 15: 'గడచిన కాలమే బహుబాగు..' అని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏ రందీ లేకుండా పంటలు సాగుచేసుకున్న రైతులు ఇప్పుడు కష్టాలతో సావాసం చేస్తున్నారు. రెండు మూడు నెలల వరకు 18 గంటలు కరెంటు వస్తే సంతోషంగా పంటలు పండించుకున్న రైతులు ఇప్పుడు కరెంటు ఎప్పుడొస్తుందా? వస్తే ఎప్పటి వరకు ఉంటుందా? అని ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. రోజుకు 11, 12 గంటలు అది కూడా దఫదఫాలుగా ఇస్తుండడంతో తడిచిన మడే మళ్లీమళ్లీ తడుస్తూ చివరి వరకు నీరందక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కడుపు మండిన రైతన్న సహనం నశించింది. కరెంటు ఏ సమయంలో ఇచ్చినా సరే నిరంతరాయంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి 9 గంటల సమయంలో నల్లగొండ జిల్లా త్రిపురారం రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని కోదాడ-జడ్చర్ల హైవేపై ధర్నా చేశారు. ఐదారు గంటలకోసారి కరెంటు ఇవ్వడం వల్ల ఉపయోగం లేదని, పారిన పొలమే పారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండుమూడు నెలల క్రితం వరకు తామెన్నడూ కరెంటు కోసం ఎదురుచూడలేదని, ఇప్పుడుమాత్రం కండ్లలో వత్తులు వేసుకొని చూడాల్సి వస్తున్నదని వాపోయారు. నిరుడు 27 ఎకరాల్లో సాగు చేస్తే ఈసారి సాగర్‌లో నీరు లేకపోవడంతో 17 వేల ఎకరాల్లోనే పంటలు సాగుచేస్తున్నట్టు చెప్పారు. ఇప్పుడు కరెంటు సక్రమంగా ఇవ్వకుంటే ఈ పంటల్లోనూ సగమే చేతికి అంతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించే వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలిసిన విద్యుత్తు ఏఈ రవీందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్తు సరఫరాను మరో రెండు గంటలు పెంచుతామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

చేతికొచ్చిన పంట ఎండిపోతున్నది

మొత్తం 11 ఎకరాల పొలంలో నాటేశాను. అందులో నా సొంత భూమి 6 ఎకరాలు. మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ప్రస్తుతం రోజుకు 12 గంటల కరెంటు కూడా రావట్లేదు. వచ్చే కరెంటు కూడా రెండు, మూడు దఫాలుగా వస్తుండడంతో పొలం సరిగా పారడం లేదు. వచ్చిపోయే కరెంటుతో పొలం దగ్గరే ఉండాల్సి వస్తున్నది. ఎంతో మంది రైతులు సొంత పొలం కాకుండా కౌలుకు తీసుకొని చేస్తుండడంతో అధికంగా నష్టపోతామనే భయం ఉంది. మాకైతే బోర్లు ఉండడంతో కొంత ఇబ్బంది తక్కువగా ఉన్నా.. లిఫ్ట్ కింద నాటేసిన పొలాలు మాత్రం ఎండిపోయినట్లే. రోజుకు కనీసం 18 గంటల కరెంటైనా ఇస్తే ఆరు తడి పంటల్లాగానైనా పండించుకుంటారు.

–అనుముల సుధాకర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

కొమురవెల్లి రైల్వేస్టేషన్‌కు భూమిపూజ

- నిధులు, భూమి సేకరణకు కేసీఆర్ ప్రత్యేక చొరవ
- క్రెడిట్ బీజేపీకి దక్కేలా ఆ పార్టీ మంత్రుల ఆరాటం

కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేసీఆర్ రైల్వేస్టేషన్ బీజేపీ భూమిపూజ

చేర్యాల, ఫిబ్రవరి 15: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు రైల్వే ప్రయాణ సౌకర్యం కల్పించాలని నాటి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంకల్పించారు. అందుకోసం ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నిబంధనల ప్రకారం.. ఈ స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చెరిసగం ఖర్చు భరించాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద కేసీఆర్ నిధులు కేటాయించారు. భూ సేకరణ విషయమై రైతులతో పలు దఫాలుగా చర్చలు జరిపి ఒప్పించారు. ఈ విధంగా రైల్వేస్టేషన్‌కు సరిపడా భూమిని కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయినా.. కొమురవెల్లి రైల్వేస్టేషన్ నిర్మాణం విషయంలో ఇప్పటి వరకూ ముందుకు రాని కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున.. కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ నిర్మాణం అంటూ హడావిడి చేస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బీజేపీ మంత్రులు, నాయకులు ఈ క్రెడిట్‌ను తమ పార్టీ ఖాతాలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, గురువారం మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్, దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ తదితరులతో కలిసి కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు కొమురవెల్లి రైల్వేస్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. దేశంలో రైల్వేల ఆధునీకరణ కోసం మోదీ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొమురవెల్లి కొండ ప్రాంతం కాబట్టి రైల్వేస్టేషన్ నిర్మాణానికి అనుకూలంగా లేదని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చిందని, కానీ.. మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం మల్లన్న పాదాల చెంత రైల్వేస్టేషన్ నిర్మించాలని తాను ప్రధాని మోదీకి వివరించడంతో ఇక్కడ స్టేషన్ మంజూరైందని చెప్పారు. తెలంగాణలో 40 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని, రూ.720 కోట్లతో సికింద్రాబాద్, రూ.350 కోట్లతో నాంపల్లి, రూ.450 కోట్లతో కాచిగూడ రైల్వేస్టేషన్, కొత్తగా చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. కొమురవెల్లి రైల్వేస్టేషన్ నుంచి మల్లన్న ఆలయం వరకు పక్కా రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వేలేటి రోజారాధకృష్ణశర్మ, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్బాడ జెమ్స్ అండ్ జ్యూయలరీ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: 3-6-291/4/B, 2వ అంతస్తు, హైదర్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ-500029.
ఫోన్: +91-40-4850411, E-మెయిల్: comsec@narbadajewellery.com,
వెబ్‌సైట్: www.narbadajewellery.com; CIN: L01222TG1992PLC014173

''తప్పొప్పుల పట్టిక''
31 డిసెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి స్టాండ్‌అలోన్ ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాల ఎక్స్‌ట్రాక్ట్
(రూ.లక్షలలో)

క్ర. సం.	వివరాలు	31-12-2023 ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేయనివి)	31-12-2023 ముగిసిన తొమ్మిది నెలలు (ఆడిట్ చేయనివి)	31-12-2022 గత సంవత్సరంలో ముగిసిన సంబంధిత త్రైమాసికం (ఆడిట్ చేయనివి)
1.	కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం	3161.46	7533.83	2971.08
2.	కాలానికి నికర లాభం/ (నష్టం) (పన్ను, అసామాన్య మరియు/ లేదా అసాధారణ ఐటమ్‌లకు ముందు)	576.94	991.69	129.05
3.	పన్ను తరువాత కాలానికి నికర లాభం/ (నష్టం) (అసామాన్య మరియు/ లేదా అసాధారణ ఐటమ్‌ల తరువాత)	431.67	742.02	96.58
4.	కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [కాలానికి లాభం/ (నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) కలిగినది]	431.67	742.02	96.58
5.	ఈక్విటీ వాటా మూలధనం	2115.73	2115.73	2115.73
6.	గత సంవత్సరానికి ఆడిట్‌చేసిన బ్యాలన్స్ షీట్‌లో చూపిన విధంగా ఇతర ఈక్విటీ (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)	-	-	-
7.	ఒక షేర్‌కు ఎర్నింగ్స్ (కొనసాగుతున్న మరియు నిలిపివేసిన కార్యకలాపాల కొరకు) – బేసిక్ : డైల్యూటెడ్:	2.04 2.04	3.51 3.51	0.51 0.45

గమనిక :
1) పై స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే పరిశీలించబడినవి మరియు సిఫార్సు చేయబడినవి. తరువాత 14 ఫిబ్రవరి 2024న జరిగిన వారి సంబంధిత సమావేశాలలో కంపెనీ డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి.
2) కంపెనీ యొక్క చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ IND AS 108, 'ఆపరేటింగ్ సెగ్మెంట్' ద్వారా పేర్కొన్న విధంగా చీఫ్ ఆపరేటింగ్ డెసిషన్ మేకర్ (CODM)గా గుర్తించబడినారు. కంపెనీ ఒక సెగ్మెంట్‌లోనే ఆపరేట్ అవుతున్నది. అప్రకారం సెగ్మెంట్ సమాచారం విడిగా తెలుపబడలేదు